సాక్షి సూర్యాపేట

గురువారం : 10 : ఆగస్టు : 2023



నీట మునిగి..
కోదాడ మండలం రెడ్లకుంటలో గేదెలు మేపేందుకెళ్లి ఇద్దరు స్నేహితులు నీటి గుంతలో మునిగి ప్రాణాలు విడిచారు. - 8లో



ముగ్గురి దుర్మరణం
నడిగూడెం, కోదాడ, కేతేపల్లి మండలాల్లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. - 8లో



కార్మికులకు మంచిరోజులు
సీఎం నిర్ణయంతో ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు వచ్చాయని టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఎన్‌హెచ్ -65ను ఆరు లేన్లుగా విస్తరించాలి

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరిన ఎంపీ బడుగుల

సూర్యాపేట : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దండుమల్కాపురం నుంచి రామాపురం క్రాస్‌రోడ్డు వరకు ఉన్న ఎన్‌హెచ్-65ను ఆరు లేన్లుగా విస్తరించాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్..కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని బుధవారం ఢిల్లీలో కలిసి కోరారు. ఎన్‌హెచ్-163పై వంగపల్లిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేసేలా అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్యారమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

దివ్యెంల(సూర్యాపేట) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి అన్నారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రీడపోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శరీర దారుఢ్యం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలను స్నేహ పూర్వకంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్య యాదవ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్రంలో ఉన్న 1,530 మంది గోపాలమిత్రలను సీనియార్టీ ప్రకారం ఆఫీస్ సబార్డినేట్‌గా అవకాశం కల్పించి మిగతా వారికి కనీస వేతనాలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.లింగయ్యగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 23 ఏళ్లుగా పశుసంవర్ధక, పశుగణాభివృద్ధి సంస్థలో రైతు ఇంటి ముంగిట్లోకి వెళ్లి కృత్రిమ గర్భధారణ సేవలందిస్తున్నామన్నారు. తమకు ప్రమాదబీమా వర్తింపజేయాలని, రాయితీపై ప్రత్యేక వాహనాలు ఇప్పించాలని కోరారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలోనూ అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మెరుగు రాములు, శ్రీను, ప్రసాద్, గోపాలమిత్రలు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, ఉపేందర్, లక్ష్మయ్య, సైదులు పాల్గొన్నారు.

పల్లెల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : అన్ని గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో తప్పనిసరిగా తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ సురేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆత్మకూర్(ఎస్) మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సంపద వనాలను, బృహత్ ప్రకృతి వనాలు, మెగా పల్లె ప్రకృతి వనాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్ నాయక్, తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి.. తిప్పలు



దివ్యెంల తహసీల్దార్ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తుల కౌంటర్ వద్ద బుధవారం జనం బారులు తీరిన ఫొటో ఇది. సుమారు వెయ్యి మంది రాగా 200 మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగలిగారు. సరైన పత్రాలు లేక దరఖాస్తులు స్వీకరించకపోవడంతో మిగతావారు వెనుదిరిగారు. దివ్యెంలలో బుధవారం ఒక్క రోజే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం 500 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

- దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- తొలిరోజు 9,212 దరఖాస్తులు
- ఇక మిగిలింది మూడు రోజులే
- మహిళల పేరిట కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం పాట్లు
- మీసేవ కేంద్రాల వద్ద క్యూ కడుతున్న జనం
- గడువు పెంచాలని ప్రజల వినతి

సూర్యాపేట : గృహలక్ష్మి పథకం కోసం జిల్లాలో దరఖాస్తుల ప్రక్రియ బుధవారం మొదలైంది. రూరల్ ప్రాంతాల్లో తహసీల్దార్ కార్యాలయంలో, అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించారు. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకం కింద రూ. 3 లక్షల ఆర్థికసాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ఈ నెల 12 వరకు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ప్రకటించింది. ఇప్పటికే ఒక్క రోజు ముగియడంతో ఇక మిగిలిన మూడు రోజుల్లో దరఖాస్తులు ఎలా చేయాలనే సందేహాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. మహిళ పేరిట లబ్ధి చేకూరుస్తామని చెప్పడంతో వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పొందడానికి పాట్లుపడాల్సి వస్తోంది.

కార్యాలయాలకు తరలిన జనం

సొంత స్థలం ఉండి పక్కా గృహం లేని పేద, మధ్య తరగతి కుటుంబాలు గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. రూ. 3లక్షల నగదు మూడు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. ప్రతి నియోజకవర్గంలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ, మైనార్టీలకు 50 శాతానికి తగ్గకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది. బుధవారం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా ఏ పత్రాలు జత చేయాలో తెలుసుకునేందుకు బాధితులు కార్యాలయాలకు తరలివచ్చారు.

జత చేయాల్సినవి..

నిర్ణీత దరఖాస్తుకు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆహార భద్రత కార్డు, ఓటరుకార్డు, ఆధార్ కార్డు, ఇంటి స్థలం దస్తావేజు, ఇంటిపన్ను రశీదు, విద్యుత్ బిల్లురశీదు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలను జత చేయాలి. దివ్యాంగులైతే సదరం సర్టిఫికెట్ సమర్పించాలి.

22 అంశాలతో దరఖాస్తు..

గృహలక్ష్మి దరఖాస్తు పత్రంలో 22 అంశాలను పొందుపరిచేలా రూపొందించారు. ఇంటి స్థలం ఉంటేనే అర్హులని నిర్దేశించారు. మహిళల పేర దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని 23 తహసీల్దార్ కార్యాలయాల్లో, 5 మున్సిపాలిటీల్లో దరఖాస్తులకు బుధవారం కౌంటర్లు తెరిచారు. తొలి రోజు 9,212 దరఖాస్తులు వచ్చాయి.

కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేక..

ఇంటి నిర్మాణ స్థలం వివరాలు, ఇంటి పన్ను, స్థలం దస్తావేజులు, కులం, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని ప్రభుత్వ మార్గదర్శకాల్లో సూచించారు. ఆ పత్రాలు లేక దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుల, ఆదాయ ధ్రువీకర పత్రాల కోసం మీ సేవ కేంద్రాల్లో క్యూ కడుతున్నారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే గడువులోగా అందుతాయనేది అనుమానమే. గ్రామాల్లో అనేక మందికి స్థల ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పన్నుల రశీదులు లేవు. దీంతో దరఖాస్తుకు అర్హులు కూడా దూరమయ్యే అవకాశం ఉందంటున్నారు. దరఖాస్తుకు గడువు పెంచాలని, గ్రామాల్లో స్థల ధ్రువీకరణ పత్రాలు లేకున్నా అనుమతించాలని కోరుతున్నారు.



తిరుమలగిరిలో మీ సేవ వద్ద గుమిగూడిన జనం

వచ్చింది 65 దరఖాస్తులే..

- మందకొడిగా మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ
- 18వ తేదీ వరకు చివరి గడువు
- రెండు, మూడు రోజుల్లో ఊపందుకునే అవకాశం
- గతేడాది జిల్లాలో 99 షాపులకు 3,023 దరఖాస్తులు



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు దరఖాస్తు అందజేస్తున్న ఔత్సాహికుడు

చిలుకూరు: జిల్లాలో మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 4 నుంచి 18వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం అధిక శ్రావణ మాసం కావడం, మంచి రోజులు ఎక్కువగా లేకపోవడంతో మందకొడిగా దరఖాస్తులు కొనసాగుతున్నాయి. జిల్లాలో 99 షాపులకు గాను బుధవారం వరకు 65 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 11 షాపులకు, చిలుకూరు మండల కేంద్రంలోని రెండు షాపులకు నేటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.

99 షాపులకు టెండర్లు..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 99 మద్యం షాపులకు లైసెన్సులు జారీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్టీలకు 3, ఎస్సీలకు 10, గౌడ్స్‌కు 27 షాపులు, జనరల్ 59 కేటాయించారు. ఒక్కో దరఖాస్తుకు రూ. 2 లక్షల రుసుం డీడీ లేదా చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుల సంఖ్య పెరిగితే ఆదాయం ఎక్కువ వస్తుందన్న కారణంతో గతంలోనూ ఇదే రుసుం ఉండగా , ఈ సారి అంతే మొత్తం కొనసాగిస్తున్నారు. ఇది తిరిగి చెల్లించే సొమ్ము కాకపోవడంతో దరఖాస్తు చేయాలనుకుంటున్న వారంతా ఆచితూచి వ్యవరిస్తున్నారు. గతంలో ఉన్న షాపుల్లో జరిగిన అమ్మకాలు, లాభాలు తదితర అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. ఎవరి పేరిటైనా ఒక షాపు వచ్చినా అందరూ నిర్వహించుకోవచ్చని భావించి మరికొందరు గ్రూప్‌లుగా ఏర్పడి పలుచోట్ల దరఖాస్తులు అందజేయాలని భావిస్తున్నారు. వచ్చే రెండు సంవత్సరాలు ఎన్నికల సమయం కావడంతో మంచి రోజులు ప్రారంభం కాగానే వైన్ షాపు టెండర్ దరఖాస్తులు ఒక్కో షాపుకు 30కు పైగా వచ్చే అవకాశం ఉన్నట్లుగా ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

21వ తేదీన డ్రా. .

మద్యం షాపులను నిర్వహించడానికి ఆసక్తి ఉన్న వ్యక్తులను లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా ఎంపిక చేయనున్నారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా లేనివాటిని తిరస్కరిస్తారు. సక్రమంగా ఉన్న దరఖాస్తుల ఆధారంగా ఈ నెల 21న ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో లక్కీ డ్రా నిర్వహించనున్నారు. కలెక్టర్ నేతృత్వంలో ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. ఇందులో అవకాశం వచ్చిన వారు వచ్చే రెండేళ్ల పాటు మద్యం షాపులను నిర్వహించడానికి అనుమతి పొందుతారు.

సంవత్సరం	షాపులు	దరఖాస్తులు	వచ్చిన ఆదాయం (రూ. కోట్లలో..)
2019	75	2641	52.82
2021	99	3023	60.46
2023	99	65	(ప్రస్తుతం బుధవారం నాటికి)

కోదాడకు 100 పడకల వైద్యశాల

- సివిల్ పనులు, పరికరాల కొనుగోలుకు రూ. 26 కోట్లు కూడా మంజూరు
- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బొల్లం

కోదాడ: కోదాడ పట్టణ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. ప్రజలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ వైద్యశాలను 100 పడకలుగా మారుస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్యశాలలో సివిల్ పనులతో పాటు అవసరమైన పరికరాల కొనుగోలుకు రూ. 26 కోట్లను మంజూరు చేసింది. కోదాడ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ నెల రోజుల క్రితం సీఎం కేసీఆర్‌ను కలిసి వైద్యశాల కోసం విజ్ఞప్తి చేయగా వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం 100 పడకల వైద్యశాల ఏర్పాటు చేస్తున్నట్లు జీఓ జారీ చేయడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

దేశ రక్షణకు కార్మిక వర్గం ఏకం కావాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : దేశ రక్షణ కోసం యావత్ కార్మిక వర్గం ఒక్కతాటిపైకి రావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఐక్య కార్మిక సంఘాల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. నరేంద్ర మోదీ కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అంబానీ, అదానీల పరం చేస్తున్నాడని, పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, ఐఎఫ్టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు చొక్కయ్య, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న మేకల శ్రీనివాసరావు

సిద్దిపేటలో మంత్రి జగదీష్‌రెడ్డి పర్యటన



సిద్దిపేటలో డైనోసార్ పార్కును చూస్తున్న మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, అధికారులు

- మంత్రి హరీష్‌రావుతో కలిసి కోమటిచెర్వు, పార్కు పరిశీలన

సిద్దిపేటజోన్: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావుతో కలిసి విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి బుధవారం రాత్రి సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటిచెర్వును సందర్శించారు. హరీష్‌రావు దగ్గరుండి జగదీష్‌రెడ్డికి సిద్దిపేట పట్టణంలోని కోమటి చెర్వు అందాలను చూపించారు. మ్యూజికల్ ఫౌంటెన్, హ్యాంగింగ్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రూబీ నెక్లెస్ రోడ్, నూతనంగా నిర్మిస్తున్న డైనోసార్ పార్కును చూపించి వాటి వివరాలను తెలుపగా.. ఇంత అద్భుతమైన పార్కు సిద్దిపేటలో ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా ఉన్నాయని మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి వెంట సూర్యాపేట అదనపు కలెక్టర్ ప్రియాంక, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



కోమటిచెర్వును చూస్తున్న మంత్రులు

వ్యవసాయ గణన పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేటటౌన్ : వ్యవసాయ గణనను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్యూటీ డైరెక్టర్ శివకుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఏఓ రామారావు నాయక్ తో కలిసి వ్యవసాయ గణనపై శిక్షణను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ గణన వల్ల వ్యవసాయ స్థితిగతులు, వివిధ ధానాల రూపకల్పనకు తోడ్పడుతాయన్నారు. ప్రభుత్వం వ్యవసాయ గణన ఐదేళ్లకు ఒకసారి నిర్వహిస్తుందన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు, పెద్ద రైతుల వివరాలు, సాగు విస్తీర్ణం, పంటలు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించాలన్నారు. వివరాలను యాప్ లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్డీఎం సీహెచ్ బాపూజీ ,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జి. శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ డి. శ్యామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

వీఆర్‌ఏలకు శాఖల కేటాయింపు

- 11న నియామక పత్రాల అందజేత

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : వీఆర్‌ఏలకు శాఖల కేటాయింపు ప్రక్రియ పూర్తి అయినట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల్లోగా వీఆర్‌ఏలు అందరూ హాజరుకావాలని కోరారు. వారికి ఇచ్చిన ఆర్డర్స్ ప్రకారం కేటాయించిన శాఖలో అదే రోజు ఉదయం జాయిన్ కావాలని సూచించారు.

18 మంది గ్రేడ్ -4 పంచాయతీ కార్యదర్శులుగా ఎంపిక

జూనియర్ పంచాయతీ సెక్రటరీలుగా నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారి పనితీరును పరిశీలించి గ్రేడ్ -4 పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 18 మందిని ఎంపిక చేసినట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. కార్యదర్శుల పని తీరును పరిశీలించేందుకు జిల్లాలో నియమించిన కమిటీ 18 మందిని ఎంపిక చేశారని, వీరికి మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మిగతా వారికి అసెస్మెంట్ పూర్తి అయిన తర్వాత ఇవ్వనున్నట్లు తెలిపారు.

షరతులు లేకుండా రూ.3లక్షలు ఇవ్వాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఇళ్ల లేని నిరుపేదలందరికీ ఎలాంటి షరతులు లేకుండా గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించిన అనంతరం ఆయన మాట్లాడారు. మూడు రోజుల్లో కులం, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, భూమి పేపర్లు, ఫొటోలు, ఓటర్ కార్డు, బ్యాంకు బుక్ ఇవన్నీ తయారు చేసుకునేదెలా అని ప్రశ్నించారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువును పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్ కుమార్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, వీరబాబు, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

రూ.12 కోట్లు వచ్చేశాయ్!

- బీసీ కుల వృత్తిదారుల ఆర్థిక సహాయానికి నిధులు విడుదల
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- నియోజకవర్గానికి 300 మంది చొప్పున అందనున్న సాయం
- కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రభుత్వం అందించే రూ. లక్ష సాయం కోసం దరఖాస్తులు చేసుకున్న బీసీ కుల వృత్తిదారులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఈ పథకానికి సంబంధించి జిల్లాకు రూ. 12 కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వేలాది మందిలో ఆశలు చిగురించాయి. మరో వైపు తమకు మొదటి దఫాలో అవకాశం ఇవ్వాలని ఇప్పటికే పలువురు బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంతోపాటు ఎమ్మెల్యేలు, సంఘాలు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా అందిన నిధుల మేరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.

17,985 మంది అర్హులు

రూ. లక్ష ఆర్థిక సాయం ప్రభుత్వం ప్రకటించిన అనంతరం జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో మొత్తం 23,374 దరఖాస్తులు అందగా ఇందులో 17,985 మంది అర్హులుగా మండల అధికారులు గుర్తించి జిల్లా కార్యాలయానికి పంపించారు. వీటిని జిల్లా అధికారులు కమిషనర్ కార్యాలయాలని అందించారు. కమిషనర్ కార్యాలయం నుంచి లబ్ధిదారుల జాబితా స్థానిక ఎమ్మెల్యేలకు చేరింది. ఇదిలా ఉండగా మొదటి విడతలో నియోజవర్గానికి 300 మందిని ఎంపిక చేసి సాయం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం జూలై 15 నుంచి లబ్ధిదారులకు సాయం సొమ్ము అందిస్తామని తెలిపింది. కానీ అనుకున్న స మయానికి నిధులు విడుదల కాకపోవడంతో అర్హులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇదిలా ఉండగా ప్రభుత్వం మంగళవారం జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు రూ. 12 కోట్లను విడుదల చేసింది.

నియోజకవర్గానికి 300 మందికి..

రూ. లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు జిల్లాలోని ప్రతి నియోకవర్గానికి 300 మందికి అవసరమైన రూ. 3 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. తుంగతుర్తి నియోజకవర్గంలో మూడు మండలాలు ఇతర జిల్లాల్లో ఉండటంతో ఇక్కడ 30 యూనిట్లు ఇతర జిల్లాలకు కేటాయించాల్సి ఉంటుంది. దీంతో జిల్లాలో 1,170 యూనిట్లు అందే అవకాశం ఉంది. కాగా ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే 300 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి జిల్లా మంత్రిచే ఆమోదం పొందాలి. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాగా మంత్రి జగదీష్‌రెడ్డి ఆమోదించారు. ఆ జాబితా అధి కారులకు చేరింది. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల జాబితా అందాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో అర్హులకు ఆర్థిక సాయం అందించనున్నారు.

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అందజేస్తాం

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బీసీ కులవృత్తిదారులకు రూ. లక్ష ఆర్థిక సాయం అందజేస్తాం. ఇప్పటికే నిధులు విడుదల చేసింది. అర్హుల జాబితాలను సంబంధిత అధికారులు రూపొందించారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో త్వరలో చెక్కులు పంపిణీ చేస్తాం.

– అనసూర్య, బీసీ అభివృద్ధి అధికారిణి

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

వలిగొండ : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. వలిగొండ మండలం ప్రొద్దుటూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన బత్తుల శ్రీనివాస్(48) రోజూ మాదిరిగా కల్లు తీయడానికి గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి జైలు

దివ్వెంల(సూర్యాపేట) : బైక్‌ల అపహరణ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్ బుధవారం తీర్పు చెప్పారు. మునగాల మండల కేంద్రానికి చెందిన పందిరి ప్రదీప్‌రెడ్డి వృత్తి రీత్యా బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. విలాసవంతమైన జీవితం గడిపేందుకు బైక్‌లను అపహరించి, వాటిని విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. ప్రదీప్‌రెడ్డి 2022లో సూర్యాపేటలో నాలుగు, కేతేపల్లిలో ఒక బైక్‌ను అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సూర్యాపేట సీఐ రాజశేఖర్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఆధారంగా బైక్‌లను చోరీ చేసింది.. ప్రదీప్‌రెడ్డేనని పోలీసులు గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి విచారించగా చోరీ చేసి విక్రయించిన బైక్‌ల వివరాలు వెల్లడించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పీపీ హేమలత వాదనలను ఏకీభవించిన న్యాయమూర్తి నిందితుడికి 6 నెలల జైలు శిక్ష విధించారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ గన్న ప్రతాప్ వర్మ సహరించారు.

జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం బుధవారం తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల సౌకర్యార్థం ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ లేదా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.నల్లగొండ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నీట మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

- మృత్యువులోనూ వీడని స్నేహ బంధం
- గేదెలు మేపేందుకు వెళ్లగా దుర్ఘటన




ఉపేందర్, అనిల్ మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు

కోదాడరూరల్ : గేదెలు మేపేందుకు వెళ్లిన ఇద్దరు స్నేహితులు నీటి గుంటలో మునిగి ప్రాణాలు విడిచారు. సూర్యాపేట జిల్లాలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ మండలం రెడ్లకుంట గ్రామానికి చెందిన పాలంపల్లి స్వామి, అన్నపూర్ణ దంపతుల పెద్ద కుమారుడు అనిల్‌కుమార్(15) కాపుగల్లులో 10వ తరగతి చదువుతున్నాడు. ఇదే గ్రామానినికి చెందిన చిర్రా తిరపయ్య సునీతల కుమారుడు ఉపేందర్ (13) కోదాడలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి చదువుతున్నాడు. ఉపేందర్‌కు జ్వరం రావడంతో వారం రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అనిల్‌కుమార్, ఉపేందర్ స్నేహితులు. కాగా, అనిల్‌కుమార్ తల్లికి కళ్లకలక రావడంతో బుధవారం కుమారుడిని గేదెల వద్దకు పంపింది. విషయం తెలుసుకున్న ఉపేందర్ మధ్యాహ్నం తర్వాత స్నేహితుడు అనిల్ వద్దకు వెళ్లాడు. ఇద్దరూ కలిసి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో గేదెలను మేపుతున్నారు.

ఈతరాక నీట మునిగి..

ప్రభుత్వ భూమిలో కొందరు మట్టికోసం పెద్ద గుంటను తవ్వగా ఇటీవల కురిసిన వర్షాలకు నిండింది. ఆ గుంటలోకి గేదెలు వెళితే ఒడ్డుకు మళ్లించేందుకు దిగారో లేక ఈత కొట్టేందుకు దిగారో తెలియదు గానీ, అనిల్‌కుమార్, ఉపేందర్ ఒంటిపై ఉన్న దుస్తులు విప్పి నీటిలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండడం, ఈత రాకపోవడంతో నీట మునిగి మృతిచెందారు. సాయంత్రమైనా అనిల్ ఇంటికి రాకపోవడంతో తల్లి అన్నపూర్ణ


అనిల్‌కుమార్ (ఫైల్)


ఉపేందర్ (ఫైల్)

వెతుక్కుంటూ గ్రామ శివారుకు వచ్చింది. రోడ్డు వెంట గేదెలు ఉండగా కుమారుడు కనిపించలేదు. సమీపంలోని నీటి గుంట వద్ద దుస్తులు కనిపించడంతో లబోదిబోమంది. దీంతో రోడ్డు వెంట వెళ్తున్న వారు వచ్చి నీటి గుంటలోకి దిగగా కాళ్లకు ఇద్దరి మృతదేహాలు తగలడంతో బయటకి తీశారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. మృత్యువు సైతం మీ స్నేహబంధాన్ని విడదీయలేక పోయిందా అంటూ గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. పోలీసులు వచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తరలించేందుకు ప్రయత్నించగా మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలో మట్టి తవ్విన వారిపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు మృతదేహాలను తరలించేది లేదని భీష్మించారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం మృతదేహాలను కోదాడ ఆస్పత్రికి తరలించారు.

పది రోజుల్లో బర్త్‌డే.. ఇంతలోనే విషాదం

- నీటి గుంటలో పడి బాలుడు మృతి


ధ్రువత్(ఫైల్)

కనగల్ : మరో పది రోజుల్లో జన్మదిన వేడుకను జరుపుకోనున్న బాలుడు ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతిచెందాడు. నల్లగొండ జిల్లాలో జరిగిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్ మండలం పొనుగోడు గ్రామానికి చెందిన పుకరం మల్లికార్జున్‌రావు, పావని దంపతులకు కుమార్తె దాక్షాయిని, కుమారుడు ధ్రువత్ (2) సంతానం. మల్లికార్జున్‌రావు పెద్దవూర గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన పీఈటీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. చండూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న దాక్షాయిని నిత్యం బస్సులో వెళ్లి వస్తుంది. అయితే, సోదరి పాఠశాలకు వెళ్లే సమయంలో ధ్రువత్ వెంట వస్తానని మారాం చేస్తుంటాడు. దీంతో పావని బుధవారం ఉదయం ధ్రువత్‌ను సమీప బంధువు ఇంట్లో వదిలి కుమార్తెను తీసుకుని బస్టాప్‌కు వెళ్లింది.

బంధువు ఇంటి నుంచి వెళ్లిపోయి..

ధ్రువత్‌కు సమీప బంధువు జామకాయ ఇచ్చి ఇంటూ ఆడుకోమని చెప్పి ఆమె ఇంటి పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో ధ్రువత్ గేటు తీసుకుని ఇంటి నుంచి బయటకి వెళ్లిపోయాడు. పావని ఇంటికి


నీటి గుంటను పరిశీలిస్తున్న పోలీసులు

వచ్చిన తర్వాత ధ్రువత్‌ను తీసుకువెళ్లేందుకు బంధువు ఇంటికి వెళ్లగా అక్కడ కుమారుడు కనిపించలేదు. మూడు గంటల పాటు గ్రామంలో వెతుకులాడగా గ్రామ మాజీ సర్పంచ్ ఇంటి పరిసరాల్లో ఓ మహిళ ఇల్లు నిర్మించుకునేందుకు తీసిన నీటి గుంటలో ధ్రువత్ విగతజీవుడై తేలియాడుతూ కనిపించాడు. ముక్కుపచ్చలారని కుమారుడు ఇక లేడని తెలుసుకుని తల్లి గుండెలవిసేలా రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న చండూరు సీఐ వెంకట్, ఎస్‌ఐ అంతిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, ధ్రువత్ మరణంపై గ్రామంలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సోమోరిగూడెం సర్పంచ్ మృతి


నర్సింగ్ శంకర్ (ఫైల్)

నిడమనూరు: బీఆర్ఎస్ నాయకుడు, నిడమనూరు మండలంలోని సోమోరిగూడెం సర్పంచ్ నర్సింగ్ శంకర్ (50) బుధవారం మృతిచెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మధ్యాహ్నం ఇంట్లోనే కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ముప్పారం నుంచి కొత్తగా ఏర్పడిన సోమోరిగూడేనికి మొదటి సర్పంచ్‌గా శంకర్ ఎన్నికయ్యాడు. శంకర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొత్త పంచాయతీల సర్పంచ్‌లు ఇద్దరూ..

ముప్పారం గ్రామ పంచాయతీ నుంచి సోమోరిగూడెం, గుంటుకగూడెం గత స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డాయి. గుంటుకగూడెం సర్పంచ్‌గా ఎన్నికైన నస్వామి గెలిచిన ఆరు నెలలకే గుండెపోటుతో, ప్రస్తుతం సోమోరిగూడెం సర్పంచ్ శంకర్ సైతం మృతిచెందాడు. ఒకే గ్రామ పంచాయతీ నుంచి ఏర్పడిన రెండు కొత్త గ్రామ పంచాయతీల మొదటి సర్పంచ్‌లు అనారోగ్యంతో మృతిచెందడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. సోమోరిగూడెం సర్పంచ్ నర్సింగ్ శంకర్ మృతికి బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.

విద్యుత్ ఉద్యోగి అదృశ్యం


మురళీకృష్ణ

నాగార్జునసాగర్: విద్యుత్ ఉద్యోగి అదృశ్యమయ్యాడు. నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని విద్యుదుత్పాదన కేంద్రంలో అటెండర్‌గా పనిచేస్తున్న మజ్జి మురళీకృష్ణ స్థానికంగా నివాసం ఉంటున్నాడు. ఈ నెల 7న ఇంటి నుంచి బయటకి వెళ్లిన మురళీకృష్ణ రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు విద్యుదుత్పాదన కేంద్రం, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో మురళీకృష్ణ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిటౌన్ ఎస్‌ఐ సంపత్ తెలిపారు.

పోచంపల్లిని సందర్శించిన ఒడిశా చేనేత కార్మికులు


చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఒడిశా కార్మికులు

భూదాన్‌పోచంపల్లి : ఒడిశా రాష్ట్రానికి చెందిన 16మంది చేనేత కార్మికులు బుధవారం పోచంపల్లిని సందర్శించారు. స్థానిక చేనేత సహకార సంఘం, కళా పునర్వి యూనిట్, చేనేత గృహాలను పరిశీలించారు. ఇక్కడ మగ్గాలపై తయారవుతున్న ఇక్కత్ వస్త్రాలు, రంగులద్దే విధానం, చిటికి కట్టడం, డిజైన్లు పరిశీలించి ఇక్కడి కార్మికుల కళానైపుణ్యాలను కొనియాడారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్ర హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండిక్రాఫ్ట్ ఇన్‌స్పెక్టర్ సునిల్‌కుమార్ మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ విధానాన్ని తెలుసుకొనేందుకు ఎక్స్‌ప్లోరర్ విజిట్‌లో భాగంగా ఒడిశాలోని జార్సిగూడ జిల్లాకు చెందిన కార్మికులతో వచ్చామని పేర్కొన్నారు. ఇక్కడి నేత విధానం, డిజైన్లు ఎంతో బాగున్నాయన్నారు.

'పులిచింతల'లో పెరిగిన విద్యుత్ ఉత్పత్తి

హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టులోని టీఎస్ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి కొంత పెరిగింది. మంగళవారం 7,800 క్యూసెక్కుల నీటితో రెండు యూనిట్ల ద్వారా 50 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా బుధవారం 8,800 క్యూసెక్కుల నీటితో 55 మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. పవర్ హౌజ్ ద్వారా 8,800 క్యూసెక్కులు లీకేజీ ద్వారా 200 క్యూసెక్కులు కలిపి 9 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 32.62 టీఎంసీల నీరు ఉంది.

రెండిళ్లలో చోరీ

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు నీలగిరిలోని రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. నల్లగొండ పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు రాంబాబు ఇంట్లోకి మంగళవారం రాత్రి చొరబడ్డారు. అతడి ఇంట్లో విలువైన వస్తువులు దొరకలేదు. మరో రెవెన్యూ ఉద్యోగి ప్రదీప్ కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగానే దుండగులు వారి వెనుక డోర్‌నుంచి వెళ్లి 15 తులాల బంగారం అపహరించుకుపోయారు. బుధవారం ఉదయం లేచి చూడగా అన్ని డోర్‌లు తీసి ఉండటంతో పాటు సామగ్రి చిందరవందరగా ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్‌ఐ నాగరాజు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

చింతపల్లి : కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన చింతపల్లి మండల పరిధిలోని కొర్ర మాన్‌సింగ్‌తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొర్ర మాన్‌సింగ్‌తండాకు చెందిన రమావత్ కవిత(45) భర్త బాలుతో తగాదాపడి మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు రాత్రి తండాతో పాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం గ్రామానికి సమీపంలోని వాగులో కవిత మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు

- విలీన ప్రక్రియపై అధ్యయనానికి విజయవాడకు వెళ్తున్నాం
- వారం రోజుల్లో పూర్తిస్థాయి గెజిట్ వస్తుంది
- తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి


సూర్యాపేట : మాట్లాడుతున్న తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి

భానుపురి(సూర్యాపేట) : ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంతో ఆర్టీసీ కార్మికులకు మంచి రోజులు వచ్చాయని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి అన్నారు. బుధవారం విజయవాడ పర్యటనకు వెళుతున్న ఆయనకు సూర్యాపేటలో ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు, టీఎంయూ నాయకులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి ప్రక్రియలో భాగంగా అధ్యయనం కోసం విజయవాడకు వెళ్తున్నామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. సీఎం కేసీఆర్ కార్మికుల కోరికను తీర్చారని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వమే కాపాడుతుందని చెప్పి సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో 43వేల మంది కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. ఆర్టీసీ బిల్లు రాజ్‌భవన్‌కు వెళ్లిన సమయంలో హైడ్రామా జరిగిందని, ఇప్పుడు బిల్లు పాస్ కాకుంటే కార్మికులు అంధకారంలోకి వెళ్తారని చెప్పి తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆందోళనలకు పిలుపునిచ్చిందన్నారు. ఒక్కరోజులోనే 7వేల మంది కార్మికులు రాజ్‌భవన్ ముట్టడికి వచ్చారని తెలిపారు. తదనంతరం గవర్నర్ కార్మికుల సమస్యలు విని ప్రభుత్వ సమాధానాలతో ఆమోదం తెలిపారని చెప్పారు. అసెంబ్లీలో బిల్లు పాస్ కావడం ఆర్టీసీ కార్మికుల విజయమని థామస్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విలీనం సమయంలో కొన్ని ఇబ్బందులు వచ్చాయని, కార్మికులకు అన్యాయం జరిగిందని, ఇక్కడ ఆ పరిస్థితి లేకుండా ఉండేందుకు అధ్యయన కమిటీ ఏర్పడిందన్నారు. 8మంది సభ్యులతో కూడిన కమిటీ రెండు రోజుల పాటు విజయవాడలో విలీన ప్రక్రియను అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. వారం రోజుల్లోనే పూర్తి స్థాయిలో గెజిట్ వచ్చే అవకాశం ఉందన్నారు. విలీనంపై ఎవరికీ అనుమానాలు అవసరం లేదన్నారు. నూతన బస్సులు కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సంఘం చీఫ్ అడ్వయిజర్ యాదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్‌గౌడ్, కోశాధికారి రాఘవరెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, బి.నరేందర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ హైదరాబాద్ జోన్ జాయింట్ సెక్రటరీ సుంకరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బెల్లి నర్సయ్య, ఎస్ఎస్ గౌడ్, బొజ్జ సైదులు, మాచర్ల లచ్చయ్య, చెరుకు వెంకటయ్య, చల్మవల్లి వెంకన్న, ఎండీ.జాని, ఇండ్ల నరేష్, గోవిందరాజులు, సావిత్రి, మేరీ, స్వరూప, మాధవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ముక్తాపూర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన కేంద్ర బృందం


ఫార్మసీ విభాగాన్ని పరిశీలిస్తున్న కేంద్ర క్వాలిటీ అనాలసిస్ బృందం

భూదాన్‌పోచంపల్లి : ప్రభుత్వం నిర్దేశించిన సూచనల మేరకు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కేంద్ర క్వాలిటీ అనాలిసిస్ అస్సెస్‌మెంట్ బృందం కోరింది. భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం కేంద్ర క్వాలిటీ అనాలిసిస్ అస్సెస్‌మెంట్ బృందం సందర్శించింది. పర్యవేక్షకులు డాక్టర్ విజయరామనన్, డాక్టర్ భరణికుమార్‌లు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా రోగులకు అందుతున్న వైద్యసేవలు, విభాగాల వారీగా రికార్డులు పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, జాతీయ రోగ నిరోధక కార్యక్రమాలపై ఆరా తీశారు. వైద్యసేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సుమన్‌కల్యాణ్, వైద్యాధికారులు యాదగిరి, శ్రీనివాస్, సందీప్, జిల్లా క్వాలిటీ మేనేజర్ రిజ్‌వాన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి, సూపర్‌వైజర్ అరుంధతి, ఆరోగ్య కార్యకర్తలు భవాని, నాగమణి, వాణి, రేణుక, ఎంఏ బేగ్, ఆశాలు నాగమణి, మనోహర, చందన, రాధిక, ఫార్మాసిస్ట్ కవిత, లక్ష్మణ్‌బాబు, గోపాల్‌రావు పాల్గొన్నారు.

కేవీకేలో 'నా మట్టి.. నా దేశం' వారోత్సవాలు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శాస్త్రవేత్తలు

గరిడేపల్లి : గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కేవీకేలో ఆజాద్ కా అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా 'నా మట్టి..నా దేశం' వారోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బి.లవకుమార్ తెలిపారు. బుధవారం ఈ కార్యక్రమంలో భాగంగా మొదట ప్రతిజ్ఞతో ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. దేశ మంతటా వివిధ ప్రాంతాల నుంచి 7500 కలశాలల్లోని పవిత్ర మట్టితో పాటు మొక్కలను ఢిల్లీకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పవిత్రమైన మట్టితో ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం సమీపంలో అమృత్ వాటికను నిర్మించనున్నారు. ఆ అమృత్ వాటికలోనే మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. ఈ అమృత్ వాటిక ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌కు గొప్ప చిహ్నంలా నిలుస్తుందన్నారు. మన్‌కీ బాత్ 103 ఎడిషన్ సందర్భంగా ప్రధాన మంత్రి మోదీ ఈ విషయాన్ని ప్రకటించారని తెలిపారు. ఆగస్టు 9 నుంచి 14వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, గనరేష్, ఆదర్శ్, మాధురి, బీఎస్సీ వ్యవసాయ విద్యార్థులు ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం


కేతేపల్లి : ప్రమాదానికి గురైన వాహనాలు


రవీందర్‌రెడ్డి మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేతేపల్లి: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. కేతేపల్లి, నడిగూడెం, కోదాడ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన హొగి హన్మంత్ పట్ని(39) డీసీఎంను నడుపుకుంటూ మంగళవారం అర్ధరాత్రి విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో బుధవారం తెల్లవారుజామున కేతేపల్లికి సమీపంలోకి చేరుకోగానే రోడ్డు పక్కను నిలిపి ఉన్న మరో లారీని వెనుక నుంచి డీసీఎం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంనడుపుతున్న హన్మంత్ పట్నికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేతేపల్లి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు హన్మంత్ రావప్ప పట్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి..

నడిగూడెం : నడిగూడెం మండలం వల్లాపురం గ్రామానికి చెందిన వల్లా రవీందర్‌రెడ్డి (50) ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రాజాపేట రెవెన్యూ పరిధిలోని తన వ్యవసాయ భూమిలో బుధవారం ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ తిరగబడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లారీ ఢీకొని..

కోదాడరూరల్ : చిలుకూరు మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన అవ్వారు రాంబాయమ్మ(68) బుధవారం కోదాడలో ఉంటున్న కూతురు ఇంటికి బయలుదేరింది. కోదాడకు చేరుకున్నాక హుజూర్‌నగర్ రోడ్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న లారీ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమదంలో రాంబాయమ్మకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. మృతురాలి కుమారుడు భూషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణ హాని ఉందన్నా..

- దివ్యాంగుడికి రక్షణ కల్పించలేదని పోలీసులపై ఆరోపణలు
- కోటేశ్వర్‌రావు హత్యోదంతంలో ఖాకీల తీరుపై విమర్శల వెల్లువ
- ఎస్‌ఐ స్పందించి ఉంటే దారుణం జరిగేది కాదంటున్న బంధువులు, గ్రామస్తులు
- పోలీసుల అదుపులో హత్య కేసు ప్రధాన నిందితుడు ?


కోటేశ్వర్‌రావు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : అయ్యా.. నాకు ప్రాణ హాని ఉంది.. కాపాడండి మహాప్రభో అని వేడుకున్నా పట్టించుకోలే.. రక్షణ కల్పించాల్సిన పోలీసులే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతోనే నిండు ప్రాణం బలైందని విమర్శలు వినిపిస్తున్నాయి. అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి గ్రామంలో దివ్యాంగుడు జడ కోటేశ్వర్‌రావును ఈ నెల 7న దాయాది మరో ఇద్దరి సహకారంతో దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. బాల్నేపల్లికి చెందిన జడ కాటమయ్య, జడ అంజయ్య సోదరులు. అంజయ్యకు కోటేశ్వర్‌రావు, రాంబాబు సంతానం కాగా, కాటమయ్యకు కాశయ్య ఒక్కడే కుమారుడు. కొద్ది రోజుల క్రితం కాటమయ్యకు పక్షవాతం రావడంతో అతడి బాగోగులను కుమారుడు కాశయ్య చూడలేదు. దీంతో తమ్ముడి కుమారుడు కోటేశ్వర్‌రావు పెదనాన్నకు సపర్యలు చేశాడు. ప్రతి ఫలంగా కాటమయ్య తన పేరిట ఉన్న 30 గుంటల భూమిని నాలుగు నెలల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో కోటేశ్వర్‌రావుకు రిజిస్ట్రేషన్ చేశాడు.

జీర్ణించుకోలేక.. కక్ష పెంచుకుని..

తండ్రి పేరిట ఉన్న భూమి తనకు కాకుండా బాబాయి కుమారుడికి రిజిస్ట్రేషన్ చేయడాన్ని కాశయ్య జీర్ణించుకోలేకపోయాడు. అప్పటి నుంచే కోటేశ్వర్‌రావుపై కక్ష పెంచుకుని గొడవలు సైతం పెట్టుకున్నాడు. దీంతో దివ్యాంగుడైన కోటేశ్వర్‌రావు అడవిదేవలపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. కాశయ్య వలన తనకు ప్రాణ హానీ ఉందని ఎస్‌ఐ హరిబాబుకు విన్నవించుకున్నాడు. కానీ కోటేశ్వర్‌రావు మొర ఆలకించని ఎస్‌ఐ గ్రామంలో మాట్లాడుకోవాలని ఉచిత సలహా ఇచ్చాడని బంధువులు ఆరోపిస్తున్నారు. మూడు నెలలుగా గ్రామంలో కోటేశ్వర్‌రావును చంపేస్తానని పలువురితో అంటున్న కాశయ్య తీరును గమనించిన కోటేశ్వర్‌రావు 20 రోజుల క్రితం కూడా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన బాధ చెప్పుకున్నాడని.. కానీ, పోలీసులు కనీసం కాశయ్యను పిలిచి మాట్లాడలేదని వాపోతున్నారు. హతుడు కోటేశ్వర్‌రావు భయందోళనను దృష్టిలో ఉంచుకుని కాశయ్యను పోలీస్ స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి ఉంటే దారుణం జరిగేది కాదని గ్రామస్తులు సైతం పేర్కొంటున్నారు. కాగా, భూమి తగాదా విషయంలో కోటేశ్వర్‌రావు పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడని, దానిని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించానని ఎస్‌ఐ హరిబాబు వివరణ ఇచ్చారు. హత్య కేసులో ప్రధాన నిందితుడైన కాశయ్యను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.